# పెదవి దాటితే....?

ఓరుగంటి జగన్నాథప్రసాద్

రూ. 116/- బహుమతిగా అందజేస్తాం.

ఆఫీసర్ గుర్నాథం కష్టపడి పైకొచ్చేడు. ఆర్థికంగా సమస్య లేదు. ఒక్కతే అమ్మాయి. పేరు రాజేశ్వరి. ఒకే అబ్బాయి. పేరు రఘు. అమ్మాయిని డిగ్రీ చదివించి, మంచి సంబంధం చూసి, పెళ్ళి చేసి, అత్తారింటికి పంపించి 'అమ్మయ్య!' అనుకున్నాడు. అబ్బాయి రఘు ఎమ్.బి.బి.ఎస్ అయిపోవస్తోంది. సంబంధాలు వచ్చేస్తున్నాయ్! అయితే మంచి సంబంధం చూడమని తన స్టాఫ్‌కి చెప్పేడు. కొన్ని సంబంధాలు తనకి వచ్చాయి. అబ్బాయికి ఉత్తరం రాశాడు. 'బయలుదేరి రమ్మని.'

అప్పుడే మొదలయింది సమస్య. రఘు ఉత్తరం రాశాడు ''నేను మన కులం కాని అమ్మాయిని, నాతోపాటే చదువుతున్న అమ్మాయిని పెళ్ళి చేసుకున్నా! నన్ను క్షమించండి!' అని. ఆ ఉత్తరం చదివి నీరైపోయాడు గుర్నాథం. పది మందికి ఈ విషయం ఎలా చెప్పాలి. అందరికీ ఈ విషయం తెలిస్తే తన పరువు ఏమౌతుంది అని తనలో తనే బాధ పడిపోతున్నాడు.

'ఏమిటి సార్! రెండ్రోజుల్నుండి చూస్తున్నా! మీరేదో బాధ పడుతున్నట్టు కన్పిస్తోంది!'' అని తన ఆఫీసులో హెడ్ గుమాస్తా తన వయస్సువాడు, ఆత్మీయుడయిన అరుణాచలం అనేటప్పటికి అంతరాలు మరచిపోయి భోరుమని బయటపడ్డాడు గుర్నాథం.

'మా వెధవ చేసిన పని చూసావటోయ్! ఏ కులం అమ్మాయినో పెళ్ళి చేసుకున్నాట్ట. ఆ ప్రేమేదో మా కులం అమ్మాయితో అఘోరించవచ్చు గదా! ఈ విషయం ఎవరికి తెలిసినా, పరువుపోతుంది. ఆత్మీయుడవి కనుక, నా బాధ తగ్గించుకోడానికి నీతో చెప్పుకున్నాను. ఈ విషయం, నీలోనే ఉంచుకో సుమా!'' అని తన బాధ తగ్గించుకున్నాడు గుర్నాథం.

* * *

'అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారుసార్' అన్న అప్పన్నతో, 'విషయం ఏమిట్రా అప్పన్నా!'' అని అడిగేడు అరుణాచలం 'ఏమో బాబూ! పెద్దోళ్ళ విషయాలు నాకేటి తెలుస్తై. నిన్న మా ఆడది చెప్పింది. గుర్నాథం గారి అబ్బాయి, ఎవరో... కులంకాని పిల్లని పెళ్ళి చేసుకున్నాట్ట. ఆ విషయమే అయ్యగార్ని అడిగినా! ఆ బాబు సానా బాధ పడుతున్నారు.'' అనేటప్పటికి ''నా కొంప మీదికి తెచ్చేవు కదరా!'' అనుకుంటూ భయపడుతూ లోపలికి అడుగుపెట్టేడు అరుణాచలం.

'రావోయ్! అరుణాచలం! రా! అప్పన్న.. ఏదో అడిగేడోయ్'' అని గుర్నాథం అనేసరికి ప్రాణాలుగ్గబట్టుకుని.

'అది కాదు సార్! నేనూ.... అసలూ.. జరిగింది?'' అని అరుణాచలం నానుస్తుంటే,

'నీకు చాలా రుణపడి ఉన్నానోయ్ అరుణాచలం! ఈ విషయం, నేను పదిమందికి చెప్పలేక, ఎలా తెలియచెయ్యాలో అని ఆలోచించి, నీకు చెప్పేను ఈ విషయం, 'అతి రహస్యం సుమా!' అని అంతే... ఆ విషయం నాదగ్గరకి చేరింది. అప్పన్నద్వారా! నా భారం తీరింది. రేపే మా రఘుకి ఉత్తరం రాస్తా, 'కోడల్ని తీసుకురమ్మని' ఎంతైనా, ఆ అమ్మాయి డాక్టరు కదా!'' అని గుర్నాథం అనేటప్పటికి 'అలాగే—— అలాగే చేయండి!' అంటూ అలాగే ఉండిపోయాడు!

